చినుకు మాసపత్రిక దీపావళి కథల పోటీలో తృతీయ ఉత్తమ కథగా

బహుమతి పొందిన కథ

# పురుషుడు



సింహం శత్రువు మీద దాడి చేసేప్పుడు రెండడుగులు వెనక్కి వేసి, తిరిగి సరి చూసుకుని, ఆ తర్వాతే ముందుకు ఉరుకుతుందిట. దాన్నే సింహావలోకనం అంటారు.

ఎందుకో ఆ సంగతి గుర్తొచ్చింది. అంతే తప్ప ఇక్కడ నేను గాని, అనిరుధ్‌గాని సింహాలం కాదు. మాకు శత్రువులూ లేరు.

అన్నట్టు అనిరుధ్ నా జీవన సహచరుడు. అసలు అతడితో పరిచయం చాలా గమ్మత్తుగా జరిగింది.

నేను డిగ్రీ చదువుతున్నప్పుడే విద్యార్థి రాజకీయాల్లో పాల్గొనేదాన్ని. చిన్న చిన్న కవితలూ రాసేదాన్ని. అవి అడపాదడపా వామపక్ష పత్రికల్లో ప్రచురింపబడుతూండేవి.

ఒకసారి, పెళ్ళి స్త్రీని బానిసగా చేసుకోడానికి మగవాడు కల్పించిన అందమైన బోను అంటూ అవేశభరిత కవిత రాశాను. దానికి చాలామంది స్త్రీవాదుల నుంచి అభినందనలు వచ్చాయి. చిత్రంగా అనిరుధ్ ఫోన్ చేసి 'ఆహా ఓహో' అని పొగిడేశాడు. నా కవితని 'ఆక్రోశధార' అని అభివర్ణించాడు. శ్రీశ్రీ తర్వాత పదాలని పవర్‌ఫుల్ ఆయుధాలుగా ప్రయోగించింది నేనేనని కితాబు ఇచ్చాడు.

అమాంతం నా స్థాయి పెరిగిపోయినట్టు అనుభూతించాను. అనిరుధ్ సామాన్య పాఠకుడు కాదు. ఉద్యమాల కళాముఖం. ఎక్కడ జనానికి అన్యాయం జరిగినా అక్కడ ప్రత్యక్షమవుతాడు. డప్పు మోగిస్తాడు. కాలికి గజ్జె కట్టుకుని చిందేస్తాడు. జనఘోషని తన గుండె చప్పుడు చేసుకుంటాడు. పాట లావాలా మారి ప్రవహిస్తుంది. జనాన్ని కదిలిస్తుంది. కదను తొక్కేలా చేస్తుంది.

అరగంటసేపు నా కృతజ్ఞతల్నీ, అతడంటే గల అభిమానాన్నీ ఏకరువు పెట్టాను. ఇంకా ఇంకా రాయమని, కలానికింకా పదును పెట్టమని తరచూ ఫోన్ చేసి వెన్ను తట్టేవాడు. బద్ధకిస్తే వెన్ను చరిచేవాడు. నేను విజృంభించాను. ఎడాపెడా రాసేశాను. రాముణ్ణీ, ధర్మరాజునీ, హరిశ్చంద్రుణ్ణీ వరుసపెట్టి ఏకిపారేశాను.

అనాదినుంచీ మగాడు చేసిన కుట్రల్ని తెలుసుకోమని, మగాడు వేసిన అదృశ్య శృంఖలాలని ఛట్‌ఫట్‌మని తెంచుకోమని స్త్రీ జాతిని ఉద్బోధిస్తూ కవిత్వం రాశాను. నాకు చక్కని గుర్తింపు, గౌరవం వచ్చాయి. మెల్లగా రాజకీయోద్యమాలలో ప్రత్యక్షంగా పాలు పంచుకోసాగాను. మరింత ఉత్తేజంతో ఉప్పొంగిపోసాగాను.

ఒక ప్రజా ఆందోళనలో మేమిద్దరం పాల్గొన్నాం. నన్నెంతో ఎరిగున్నట్టు ప్రవర్తించాడు అనిరుధ్. నా ఓ కవితకి బాణీ కట్టి పాడుతూ ఆడాడు. జనం నుంచి అమోఘమైన ప్రతిస్పందన లభించింది. ఆ ధర్నా రెండ్రోజులు కొనసాగింది. మేం మరింత దగ్గరయ్యాం.

"ప్రేమా దోమా లాంటి బూర్జువా పడికట్టు పదాల మీద నాకు నమ్మకం

లేదు. నువ్వంటే నాకు ఇష్టం. నేనంటే నీకిష్టమైతే చెప్పు కలిసుందాం. కలిసి ప్రయాణిద్దాం" అన్నాడు.

దిమ్మెరబోయాను. అతడ్నుంచి అలాంటి ప్రతిపాదన వస్తుందని ఊహించలేదు.

అనిరుధ్ నలుపైనా బాగానే ఉంటాడు. నాకంటే 8-10 ఏళ్ళు పెద్దేమో. అంతే. ఖద్దరు లాల్చీ, పైజామా, కళ్ళజోడు, నిర్లక్ష్యపు జుట్టు, ఓ భుజాన డప్పు, మరో భుజాన వేళ్ళాడే గుడ్డసంచి, ఆకు చెప్పులు - ఇదీ అతడి అవతారం. ఒక పార్టీలో పూర్తి కాలపు కార్యకర్త!

నేను కొంచెం బాగానే ఉంటాను. బంగారు నగలూ, మెరుపు చీరలూ ధరించనుగాని లేకపోతే చూసీ చూడగానే 'అందగత్తే సుమా' అన్పించుకుంటాను.

అతడ్తో పెళ్లీ గిళ్ళీ లేకుండా కలిసుండటం ఇష్టమే. కాని ఎవరేంటో, ఎవరి బ్యాక్‌గ్రౌండ్ ఎంటో తెలీకుండా...!

"నా కులం ఏమిటి, నా మతం ఏమిటి, నా ఆర్థికస్థితి గతులేంటి అని సందేహ పడుతున్నావా?" నా మెదడు చదివినట్టుగా అడిగాడు.

"అహ అలా అని కాదు..."

"అర్జంటుగా నీ బుర్రని యాసిడ్‌తో కడిగెయ్. మన మాటల్నీ, రాతల్నీ మనమే నమ్మకపోతే ఎలా? ఒక ఆడా మగా కలిసుండటానికి కావల్సింది ఇష్టం తప్ప మరేమీ కాదు. నిన్ను నిన్నుగా ఇష్టపడుతున్నా, నన్ను నన్నుగా స్వీకరించగలిగితే చెప్పు. దానివల్ల మనం మరింత చైతన్యంతో, మరింత శక్తివంతులమై మనం నమ్మిన దారిలో నడవగలం. అన్నిటా చేయీ చేయీ పట్టుకుని మన ఆశయసాధనకుగాను మరింతగా పునరంకితం కాగలం"

ఉద్విగ్నురాల్నయ్యాను. ఓకే చెప్పేశాను.

తర్వాత ఇంట్లో చెప్పాను. అన్నయ్య చెడ తిట్టాడు. అమ్మ బుగ్గలు నొక్కుకుని నిబిడాశ్చర్యంతో చూసింది. నాన్న నా చిన్నతనంలోనే ఒక దొమ్మీ గొడవలో చనిపోయాడుగాని, ఇప్పుడుండి ఉంటే తప్పకుండా నా నిర్ణయానికి వీరంగం ఆడేవాడే! నాన్నా మగాడేగా!

"అతడెవరో ఏంటో అతడి కుటుంబం ఎలాంటిదో ఏమీ తెలుసుకోకుండాఈ తొందరపాటేవిటే!" భయంగా చూసింది అమ్మ.

"అతడు మంచి వ్యక్తి. నేను కలిసుండేది అతడ్తో గాని అతడి కుటుంబంతో కాదు"

"నీకోసం కుటుంబాన్నీ, కుటుంబ బాధ్యతల్నీ వదిలేసి వచ్చేస్తాడా?"

"యాఁ" చిరుగర్వంతో తలెగరేశాను.

"అలాంటివాడు రేపు నీ బాధ్యతనీ వదిలెయ్యడనేవిటే పిచ్చిదానా! మగాడికేం దులిపేసుకుని పోగలడు. ఓ  మతంలో అయితే మూడు సార్లు తలాక్ అని చెప్పి తేలిగ్గా భార్యని వదిలేయగలడు. మతం, కులం, వర్గం ఏదైనా సరే మగాడి ప్రవర్తన ఒకే రకంగా ఉంటుంది. ఆడదాని మీద ఆధిపత్యం చలాయించాలనే చూస్తాడు. బంధాలూ, బాధ్యతలూ లేకపోతేనే అతగాడికి హాయిగా ఉంటుంది. కాని ఆడదానికి ఒక రక్షణ, ఒక నిలకడ, ఒక సామాజిక గుర్తింపూ కావొద్దూ? రేపు పిల్లలు పుడితే నీతో బాటుగా వారి బరువు బాధ్యతలు తలకెత్తుకోవద్దూ? నా మాట విని పెళ్లి చేసుకోండి. ఆ తర్వాత ఎన్ని చిందులు వేస్తారో మీ ఇష్టం"

నవ్వాను. "నీవన్నీ బూజు పట్టిన భావాలే అమ్మా. మాకిద్దరికీ వివాహ వ్యవస్థ మీదే విశ్వాసం లేదు. అసలు దాని ఉద్దేశమేంటో తెలుసా? ఆడదాన్ని మగడికీ, అతడి ఇంటికీ, అతడి పిల్లలకీ బానిసని చేయడమే. స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని హరించి ఆమె ఎగిరిపోకుండా రెక్కలు కత్తిరించడమే!"

"చాలు చాల్లే. మిడిమిడి జ్ఞానంతో మిడిసి పడకు. వివాహం అనేది నిన్నా మొన్నా వచ్చింది కాదు తెలుసా?  పెళ్లివల్ల వ్యక్తి స్వేచ్ఛకి ఇబ్బందులొస్తే, ఆ చట్రం ఇరుకైతే సవరించుకోవాలి. సరిదిద్దుకోవాలి. మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అంతేగాని మొత్తం వివాహ వ్యవస్థనే కాలదన్నెయ్యకూడదు" పెద్ద ఉపన్యాసమే ఇచ్చింది అమ్మ.

"అమ్మా! నువ్వు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు తీసుకున్నావని నాకు తెలుసు. దయచేసి నీ పాఠాలు పాఠశాలకే పరిమితం చెయ్యి. ప్రతిదానికీ ఇంకొకరి మీద ఆధారపడటం, వారి అజమాయిషీకి లోబడి బతకడం నాకు చాతకాదు. నేను నేనుగా తలెత్తుకుని బతగ్గలిగే స్థితి, స్థాయి నాక్కావాలి. నా అభిప్రాయాలకి, అస్తిత్వానికి, ఆర్థిక స్వేచ్ఛకి ఎలాంటి ఆంక్షలూ ఉండకూడదు. నా కంఠశోష తప్ప ఇదంతా నీకర్థం కాదులేమ్మా!"

"గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించినట్టుంది నీ వరస. పెళ్లి నీకూ, నీ పిల్లలకీ ఇచ్చే రక్షణ, భద్రత, భరోసా ఎలాంటివో నీకిప్పుడు అర్థం కాదు. రేపతగాడికి నీ మీద మోజు తగ్గి మరో కుర్రదాని వెంటపోతే నువ్వేంజేస్తావే?" గట్టిగానే నిలదీసింది అమ్మ.

"అలాంటి పరిస్థితే రాదు. వస్తే గిస్తే మరొకణ్ణి చూసుకుంటా. లేదా ఒంటరిగా బతికేస్తాను..."

"ఒంటిచేత్తో ఈదుకు రావడానికి నేనెన్ని అగచాట్లు పడుతున్నానో నీకు తెలీదూ? మిమ్మల్ని పెంచి పెద్ద చేయడానికి ఎన్ని అష్టకష్టాలు పడ్డానో ఎరగవూ? అన్నీ తెలిసి కూడా అలా అడ్డదిడ్డంగా ఎలా మాట్లాడగలుగుతున్నావే? ఇవాళున్నట్టు రేపుండదు. ఈ వేడీ, వయస్సూ, అందం, ఆకర్షణా ఏటెల్లకాలం ఉండవే..."

"నాకలాంటి భయాల్లేవ్. అనిరుధ్ జెంటిల్ మ్యాన్"

"కడదాకా అలాగే వుంటే మంచిదే. రేపు నీ మీద మొహం మొత్తితే? అతడు పక్కదార్లు తొక్కితే? ఏం చెయ్యగలమే, నెత్తీ నోరూ కొట్టుకోవడం తప్ప! అదే పెళ్లి చేసుకుంటే ముక్కు పిండి, చెవి మెలేసి బుద్ధి చెప్పొచ్చు!"

"చేసేదేదో పబ్లిగ్గా చేస్తాం తప్ప మా మధ్య రహస్యాలూ, మోసాలూ ఉండవ్" నిర్లక్ష్యంగా అన్నాను.

"నీకు లేకపోయినా అతడికి ఉండొచ్చుగా! నలుగుర్తో రాచుకు పూచుకు తిరుగుతున్నావని అతడు అనుమాన పడొచ్చు. అప్పుడు నీ పరిస్థితేంటే? శ్రీరాముడంతటి వాడే ...!" ఆ పై మాటలు మ్రింగేసింది.

పెద్దగా నవ్వాను. "రాముడు సీతని ఎందుకు వదిలేశాడో తెలుసా? భార్య గనుక! అసలు పెళ్ళే చేసుకోనప్పుడు భార్యబాధలూ ఉండవు, భర్త పెత్తనాలూ ఉండవు. ఇద్దరం ఆజన్మ స్నేహితుల్లా కలిసి మెలసి ఉంటాం"

"మీరు కలకాలం అలాగే కలిసుంటారని గ్యారంటీ ఉందా?"

"గ్యారంటీలూ, హామీలూ, భరోసాలూ కోరుకుంటే అది జీవన సాహచర్యం అవ్వదు. పెళ్లి అవుతుంది. ఐ హేట్ మ్యారేజ్ సిస్టం! దట్సాల్!"

అమ్మది పురాణాల చదువు. పురాతన భావజాలం. భూతకాలపు అనుమానాలూ, భయాలూ. అందుకే ఆమె మాటలు నా చెవికెక్కలేదు. దాంతో వాటి గురించి అధికంగా ఆలోచించాల్సిన అవసరం లేకపోయింది.

నేనూ అనిరుధ్ కలిసి ఉండటానికి ఒక గూటికి చేరాం. ఇద్దరం కట్టు బట్టల్తోనే వచ్చాం. హంసతూలికా తల్పాలూ, పట్టు పరుపులూ మాకక్కర్లేదు. ఎలా వున్నా సర్దుకుపోగలం. చాప పడకే మహా సౌఖ్యంగా భావించుకోగలం.

కొత్త చోట కాపురం – అదే సహజీవనం. ఎంతో అద్భుతంగా ఉంది. వయస్సు ఆరాటాలూ పోరాటాలే కాదు మా ఆలోచనలూ ప్రణాళికలూ మమ్మల్ని ఉత్తేజపరుస్తున్నాయి. మహా ఆనందం మా కౌగిల్లో బందీ అయ్యింది. మా సాహచర్యం మమ్మల్ని చైతన్య తరంగాలు చేసింది.

అతడి పాటకి నేను పల్లవి అయ్యాను. నా కవితకి అతడు చరణం అయ్యాడు.

కలియడానికి ఒక ఆడా ఒక మగా చాలు. కాని కలిసుండటానికి ఒక ఇల్లు కావాలి. దానికి అద్దె చెల్లించాలి. కరెంటుకీ, నీటికీ నెలనెలా సొమ్ము కావాలి. కడుపు నింపుకోడానికి నానా సరుకులు, సామాన్లు కావాలి. అందుకు డబ్బు– అదీ స్థిర ఆదాయం తప్పనిసరి అని ఆ వెంటనే అర్థమైంది.

"నా పద్ధతీ ప్రయాణం వేరు. నా అరకొర సంపాదన మీద ఆశ పెట్టుకోవద్దు.

నువ్వే ఏదైనా జాబ్ చెయ్యి"

అతడి మాటల్లో పాయింటు కన్పించింది. ఒక స్కూల్లో టీచర్‌గా చేరాను. రోజులు బాగానే గడుస్తున్నాయిగాని స్కూలు వర్కు ఇంటికి మోసుకురాక తప్పట్లేదు. స్టూడెంట్స్ వర్క్ సరిగ్గా కరెక్షన్ చేయకపోతే అటు మేనేజ్ మెంటూ, ఇటు పేరెంట్సూ చెరో పక్కా వాయించేస్తారు. అనిరుధ్ ఎక్కడెక్కడికో వెళ్తూ అప్పుడప్పుడూ వస్తుంటాడు. అంచేత ఇంటి పని సాంతం నా మీదే పడింది.

కవిత్వం మాట దేవుడెరుగు సభలూ సమావేశాలకు వెళ్ళడానికే సమయం ఉండట్లేదు. వెళ్ళిన సభల్లో పెదాల మీది నవ్వుతో పలకరిస్తూ, కళ్ళతో ఏవో 'ఊసులు' చెప్పుకుంటున్నారు మిత్రులు!

ఆ పరిస్థితి భరించడం ఇబ్బందిగా ఉంది. నేను వ్యభిచారిణి అనో, లేక అతడు నన్ను ఉంచుకున్నాడనో భావిస్తున్నారేమోనని భయమేసింది.

"నీ, నా మిత్రుల్ని పిలిచి ఇంట్లో టీ పార్టీ ఇద్దాం" ప్రతిపాదించాను.

నా వంక తేరపారి చూసి అన్నాడు. "మన సంబంధానికి ఈ మనువాదపు సమాజపు ఆమోదముద్ర కోసం పాకులాడుతున్నావా?"

"అలాగని కాదుగాని ఫ్రెండ్స్‌కైనా తెలియాలిగా!"

"నీ ఇష్టం"

గెట్ టుగెదర్‌కి ఇరవైమందిదాకా వచ్చారు. అందులో మాలాగే సహజీవనం చేస్తున్న మూడు జంటలున్నాయి. వారిలో కులమతాలని ఖాతరు చేయని వారూ ఉన్నారు. వారెంతో ఆనందంగా అన్యోన్యంగా ఉన్నారని విని ఎంతో సంతోషించాను. ఏదో తెలీని భరోసా చిక్కినట్టు అనుభూతించాను. మా ఇంట్లో 'వస్తు ప్రదర్శన' లేకపోయినా ఎంచక్కా పొదరిల్లులా ఉందని పొగిడారు. మా ఇద్దర్నీ అభినందనలతో ముంచెత్తారు.

అంతా సెలవు తీసుకుని వెళ్తోంటే నా సన్నిహితురాలు శాంత కొంచెం వెనకగా నడిచి, "అతడికి ఇదివరకే పెళ్ళైందనుకుంటాను" అంటూ బాంబు పేల్చింది. దిగ్భ్రమగా చూడగా, "ఎందుకైనా మంచిది నీ జాగ్రత్తలో నువ్వుండు" అని చెప్పి వెళ్ళిపోయింది.

చేదు మింగినట్టు అయిపోయాను. భవిత ముఖ్యంగాని గతం కాదనుకున్నాను. కాని... ఒకవేళతడికి నిజంగానే పెళ్లై ఉంటే... నాకొచ్చే నష్టమేంటి? ఛా- స్నేహబంధంలో లాభనష్టాలు చూడటం అబ్సర్డ్. కాని ఏదో మోసబోయిన భావన వేరూని వృక్షమౌతూ...!

"అలా వున్నావేం వసుధా"

"నథింగ్"

దేనిగురించో దీర్ఘంగా ఆలోచించి, ఆపైన చిన్నగా నిట్టూర్చి అన్నాడు అనిరుధ్ "నువ్వు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకో"

"మనది ఫ్యామిలీ అవుతుందా?" అనాలోచితంగా అడిగాను.

"తర్కం వద్దు. పిల్లలు పుడితే స్వార్థం పెరుగుతుంది. మన లక్ష్యసాధనలో వెనకబడిపోతాం"

'ఇప్పటికే నా పని గుడుగుడు గుంచం అయిపోయింది' అనుకుంటూ, "టూ ఎర్లీ కదా. తర్వాత ఆలోచిద్దాంలే" అన్నాను.

"సుందరయ్యలా, ప్రకాశ్ కరాంత్‌లా ముందే ఆపరేషన్ చేయించుకుంటే అనవసర లగేజీ ఉండదు. ఎలా ఉండాలంటే అలా, ఎలా తిరగాలంటే అలా ఉండొచ్చు. కావల్సినంత స్వేచ్ఛ ఉంటుంది"

"నువ్వు చేయించుకుంటావా?" సాలోచనగా అడిగాను.

"అహ. మగాళ్ళకి సజెస్టబుల్ కాదుట"

ప్రశ్నార్థకంగా చూశాను గాని అతడా విషయం మరి పొడిగించలేదు.

ఎంచేతోగాని అతడి తరపు బంధువులెవరూ మా ఇంటివైపు తొంగి చూళ్ళేదు. ఇటు మా అన్నయ్యా రాలేదు. నా మీద చాలా కోపంగా ఉన్నాట్ట. మా ప్రథమ అతిథిగా అమ్మ వచ్చింది. పొంగిపోయాను.

అనిరుధ్‌కి పరిచయం చేశాను. "బావున్నారా అత్తయ్యగారూ" అని నోరారా అడిగి ఆ ముసిల్దాన్ని సంతోషపెడతాడని ఆశించాను. కాని, "ఎలా ఉన్నారు?" అని అడిగి ఊరుకున్నాడు. ఎలాంటి బంధుత్వం కలపలేదు. నాకే ఏవిటోగా అన్పించింది.

అమ్మ ఊరుకోలేదు. అతడి గురించెన్నో అడిగింది. తన పాటల్ని పుస్తకంగా తీసుకు రావడానికి ప్రయత్నిస్తున్నాననీ, ఆర్థిక సాయం చేసే వారికోసం వెదుకుతున్నాననీ చెప్పాడు.

"జనాభ్యుదయం కోసం అహరహం కృషి చేసే నాకు మద్దతిచ్చేవారు లేకపోవడం ఈ దేశపుదౌర్భాగ్యం!" అన్నాడు బాధగా.

అతడు బయటికెళ్ళేక అమ్మ అడిగింది "అతడ్ని నువ్వు పోషిస్తున్నావా, నిన్ను అతడు పోషిస్తున్నాడా?"

"ఏదైనా ఒకటేగా!"

"అలా ఎలా అవుతుందే పిచ్చిమొద్దూ. ఇంటిని నువ్వు మోస్తుంటే, అతడు ఇల్లు పట్టక బలాదూరు తిరుగుతున్నాడు. మీ వరసేం నాకు నచ్చలేదు. రేపు పిల్లలు పుడితే అడుగడుగునా ఖర్చే కదే. వాళ్ళకి సరైన చదువైనా చెప్పించాలా వద్దా!"

"అసలు పిల్లలే లేకపోతే సమస్యలే వుండవుగా!" అనిరుధ్ మాటల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ అన్నాను.

"ఇదెక్కడి చోద్యమే తల్లీ! పిల్లల్లేకుండా లింగూ లిటుకూమంటూ మీ ఇద్దరూ

ఉంటారా! రేపు కాలూ చెయ్యీ వంగేక ఎవరు చూస్తారే? వెధవాలోచనలు కట్టిపెట్టి ఇప్పుడైనా నా మాట విను. మగాడ్ని ఇంటికి కట్టేసి ఉంచేది పిల్లలేనే" అంటూ ఎంతో చెప్పుకొచ్చింది.

ఒకవేళతడికి ముందే పెళ్లై ఉండి, పిల్లలు కలిగి ఉన్నందున వారికి అన్యాయం చేయలేక అలా ప్రవర్తిస్తున్నాడా? అందుకనే సంతానం వద్దంటున్నాడా?

"తిండీ మంచం ఊరికే దొరుకుతోంటే ఎవడికైనా చేదా? అసలు నీకేం కావాలో, నీ పరుగులూ, పాట్లూ దేనికోసమో ఆలోచించుకోవే పిల్లా!" అనేసి వెళ్ళిపోయింది అమ్మ.

ఎటూ తోచకుండా ఉంది. అతడ్ని అడగటానికి మనస్కరించలేదు. అడిగితే అపార్థం చేసుకోవచ్చు కూడా!

సాహితీమిత్రురాలు సువర్ణ కథాసంపుటి ఆవిష్కరణ సభకెళ్ళాను. ఆదివారం అవడం అదృష్టమయ్యింది. పాత స్నేహితులంతా కలిశారు.

"అనిరుధ్ సాహచర్యంతో కవితావేశంతో ఉప్పొంగిపోతావనుకుంటే చప్పబడి పోయావేంటి? మీ ఇద్దరి మధ్యా అంతా ఓకేనా?" అడిగింది శాంత.

నాకెంతో బాధేసింది. ఆవేదన కలిగింది. నాకు తెలీకుండానే 'అతడికి' 'ఇంటికి' బందీనైపోయానా? నా రక్తంలో సంచలనం పుట్టింది. ఆవేశం కదను తొక్కింది. ఆ రాత్రంతా కవిత్వ సృష్టి చేసి తెలతెలవారుతూండగా పడుకున్నాను.

తలుపులు దబదబ బాదారెవరో. అధాట్టుగా లేచి వెళ్ళి తీశాను. అనిరుధ్. పుట్టెడు జ్వరంతో వణకుతున్నాడు. టాబ్లెట్ ఇచ్చి, టీ కాసిచ్చాను. మగతగా పడుకున్నాడు.

స్కూలుకి తయారవుతోంటే, "నా ఖర్మకి నన్నొదిలేసి రింగురంగా అంటూ వెళ్ళాలా?" అన్నాడు కోపం, విసుగూ కలగలిపి.

"ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. లీవు అడిగితే ప్రిన్సిపాల్ కోప్పడతాడు" మెల్లగా చెప్పాను.

"సెలవు అడిగితే వాడికి కోపం. అయిదో తారీఖు లోపల ఇంటద్దె ఇవ్వకపోతే ఓనర్‌కి కోపం. పార్టీ కార్యక్రమాల్లో పాల్గోకపోతే లీడర్లకి కోపం! ఇంతా చేసి ఏవైనా బెనిఫిట్స్ వస్తే వాళ్ళ వాళ్ళకీ, వాళ్ళ తాబేదార్లకీ ఇచ్చేసి మనకి మాత్రం తొంటి చెయ్యి చూపిస్తారు! క్యాస్టులు పోవాలంటూనే క్యాస్ట్ ఫీలింగు చూపిస్తారు. అంతా సమానమంటూనే తన, మన తేడా చూపిస్తారు. ఆఖరికి నా పాటల బుక్ ప్రింటు చేయమంటే అమ్ముడవ్వవని వ్యాపార సూత్రాలు వల్లిస్తారు! ఛీ– అంతా హిపోక్రయిట్సే! దగుల్బాజీలే!" ఎన్నాళ్ళనుంచి లోలోన సెల వేస్తోందో ఆక్రోశం వెలిగ్రక్కాడు.

కొన్ని పేర్లు ఉదాహరించి, "వాళ్ళతో సమానమైన ప్రతిభ నీకుంది. అధైర్యపడకు. నీకూ ఒక రోజొస్తుంది" అన్నాను.

"రాదు రాదు. వాళ్ళని వారి సంఘాలూ, పార్టీలూ నెత్తిన పెట్టుకుని మోశాయి. ఆహా, ఓహో అంటూ వంత పాడాయి. దాంతో జనం హారతులు పట్టారు. దెబ్బకి గొప్పోళ్ళై పోయారు. కాని మా వాళ్ళు అలాంటి పుష్ ఇవ్వరు. పేరు రానివ్వరు. పైకెదగనివ్వరు. అందరూ లాలూచీగాళ్ళే. వాళ్ళకి పదవులూ పైరవీలూ ఉంటే చాలు కార్యకర్తలేమై పోయినా ఫర్లేదు. ఏమైనా అంటే ఎత్తుగడలూ చెరకుగడలూ అంటారు!" ఉక్రోషంతో ఊగిపోయాడు అనిరుధ్.

అతడ్ని ఓదార్చి, ధైర్యం చెప్పి, స్కూల్లో పర్మిషన్ తీసుకుని వచ్చేస్తానని చెప్పి పరుగెత్తాను. కాని రాలేకపోయాను.

సాయంత్రం ఇంట్లో అడుగుపెట్టేసరికి ఉగ్రుడై మీద పడి కరిచేశాడు.

తనంటే నాకు లెక్కలేదని అరిచాడు. "మీ అగ్రకులపోళ్ళ బుద్ధే ఇంత. వాడూ వీడూ అనిలేదు అందర్నీ అణగదొక్కి పెత్తనం చలాయించాలని చూస్తారు" అని నిందించాడు.

నా మౌనం అతడ్ని శాంతింపజేసింది. సారీ చెప్పాడు. వ్యతిరేక పరిస్థితుల్నీ, అసంతృప్తినీ తట్టుకోలేకపోతున్నానని వాపోయాడు.

"డబ్బు తీసుకుని మరో పార్టీ తరపున ఆడి పాడిన వారికి సర్కారు కొలువులొచ్చాయి. బిరుదులొచ్చాయి. సన్మానాలూ అవార్డులూ వచ్చాయి. ఎటూ కాకుండా పోయింది నేనే. అటు జంప్ చేసినా బాగుండిపోయేది. నీకన్నా ఎక్కువ సంపాదించే వాణ్ణి. ప్చ్– నమ్మిన దారే దగా చేసింది!" విహ్వలయై కన్నీరు పెట్టుకున్నాడు.

"నీ పుస్తకం గురించి బెంగ పెట్టుకోకు. ఫ్రెండ్స్ సాయం తీసుకునైనా నేను ప్రింటు చేయిస్తాన్లే" భరోసా ఇచ్చాను.

ఆశ్చర్యానందాలు చుట్టేయగా నా భుజాలు పట్టుకుని కుదిపేశాడు. "నువ్వు గ్రేట్" అని పొగిడాడు.

దాతల కోసం విచారిస్తోంటే, ఒక పబ్లిషర్ నా కవితల్ని పుస్తకంగా వేస్తానని ముందుకొచ్చాడు. కాదంటే సగం ఖర్చు నన్ను భరించమన్నాడు.

"నీ కవితలకి పుస్తకాకృతి కల్పిస్తేనే అవి నిలుస్తాయి. నీకు పేరు వస్తుంది" అన్నారు మిత్రులు.

స్కూల్లో ఎడ్వాన్సు తీసుకుని డబ్బిచ్చాను. మొదటి కాపీని అనిరుధ్ చేతిలో పెట్టాను. అపనమ్మకంగా చూశాడు. జరిగింది చెప్పాను.

"ఆడవాళ్ళ రచనలే వేస్తారు. ఆడవాళ్ళ పుస్తకాలే ప్రచురిస్తారు. ఆడవాళ్ళు రాసినవే చదువుతారు! హు వెర్రిజనం! గొర్రె జనం!" ఛీత్కరిస్తూ పుస్తకం పక్కన పెట్టేశాడు!

స్థాణువయ్యాను. తేరుకుంటూ అన్నాను "నీకూ పబ్లిషర్ దొరుకుతాడు చూడు"

"నేను పోయాక గొప్పగా వేస్తార్లే!"

"అనిరుధ్!"

"మూడ్ బాగోలేదు యార్" అంటూ విసురుగా బయటికెళ్ళి తాగి వచ్చాడు– నాకు తెలిసి ప్రథమంగా!

పీజీ చేస్తే లెక్చరర్ని కావొచ్చు. పొజిషనూ, ఆదాయమూ పెరుగుతాయి. నా ఆలోచనని మిత్రులు ప్రోత్సహించారు. ప్రైవేటుగా ఎంఏకి కట్టాను.

సంగతి విని పెదవి విరచేశాడు అనిరుధ్. "ఎంఏ తెలుగా? పరమ వేస్ట్. అసల్నీకిప్పుడు చదువెందుకు?"

"నా ఆసక్తి మేరకు చేరాన్లే" ముక్తసరిగా జవాబిచ్చాను.

నాకు నెల తప్పింది. డాక్టర్ కన్ఫర్మ్ చేసింది. సందేహిస్తూనే అనిరుధ్‌కి చెప్పాను. నా సంబరాన్నీ దాచుకోలేకపోయాను.

"పిల్లల్ని కనాలని నేనేమీ తపించి పోవట్లేదు అనిరుధ్. కాని ఆ న్యూస్ తెలిశాక నాకు తెలీకుండానే నాలో ఏవేవో మార్పులొచ్చేస్తున్నాయి. ఈ పరిణామం నాకే చిత్రంగా ఉంది. నా కడుపులో చిన్ని ప్రాణి! తలచుకుంటేనే ఆశ్చర్యంగా ఉంది. నేను ఒక జీవికి ఊపిరి పోశాను అనిరుధ్. నేను సృష్టికర్తని. ప్రాణం పోసేది బ్రహ్మకాదు అమ్మే అనిరుధ్. ఆ ఫీలింగ్, ఆ భావన ఎంత హృద్యంగా, మనోజ్ఞంగా, గర్వంగా ఉందో!"

ఆనందోద్విగ్నయై ఏదేదో చెప్పుకుపోతోంటే వెర్రిగా చూశాడు.

"ఫూలిష్ సెంటిమెంట్స్! ఇది బంధం కాదు బంధనం. కాళ్ళు కట్టేసుకుని డ్యాన్సు చెయ్యడం నాకు చాతకాదు. నాకిష్టం లేదు" మొహం ఎర్రగా చేసుకుని అన్నాడు.

అతడి ధోరణి నన్ను ఆశ్చర్యపరచలేదు. "మన ప్రేమఫలం" అన్నాను మెల్లగా.

"సినిమా టైటిల్లా ఉంది"

"పోనీ మన సాంగత్యానికి, సాహచర్యానికి గుర్తు అనుకుందాం"

"దాని తాలూకు బరువు బాధ్యతలన్నీ నువ్వే మోయాలి. బాగా ఆలోచించుకో మరి"

నా మోము జేవురించింది. అతళ్ళో దుష్యంతుడు కనిపిస్తున్నాడు!

'ఏదైతే అవ్వనీ' అనుకున్నాను. అమ్మ మాటలూ నా మీద పరోక్షంగా పని చేశాయేమో తెలీదు.

పండంటి మగబిడ్డకి జన్మనిచ్చాను. నా రక్తమాంసాలు పంచుకుని నా లోంచి ఊడిపడ్డ 'నా' పసికందుని చూసి మురిసిపోయాను. గర్వాతిశయంతో పొంగిపోయాను.

ఫోన్ చేసి చెప్పినా సరే తర్వాతెప్పుడో వచ్చాడు అనిరుధ్. బిడ్డ వంక

తేరిపారిచూశాడు. "అన్నీ నీ పోలికలే. నీ బిడ్డ కదా. అన్నింటా మీ డామినేషనే!" అన్నాడు. తిరిగి తనే "వీడికి నా కులం పేరు రాయించు" అన్నాడు.

నవ్వాను. "తల్లి సత్యం, తండ్రి నమ్మకం. నా కులమే రావాలి. రావొచ్చని చట్టమూ ఒప్పుకుంది. అయినా కులాలు ఉండకూడదన్నది మన సిద్ధాంతం గనుక ఇండియన్ అని రాయిద్దాం"

"అప్పుడు ఎందుకూ కాకుండా పోతాడు. నా కులం పేరు రాస్తే రిజర్వేషన్ బెనిఫిట్ వస్తుంది. ఇదేం తప్పు కాదు. లీడర్లూ, అధికార్లూ అంతా చేసేదే!"

ప్రూన్పడి చూశాను. ఆశయాలు వాస్తవిక ప్రయోజనాల ముందు మోకరిల్లుతున్నాయి! అంతేనా లేక దాని వెనుక అతడి 'మగరక్తం' ఉందా?

ఎంఏ పాసవుతూనే లెక్చరర్ జాబ్ వచ్చింది. జీతం మూడురెట్లు పెరిగింది. ఇంట్లోకి చక్కని దుస్తులూ, సామాన్లూ, సుఖాలూ మెల్లగా నడచి రాసాగాయి.

ఇదంతా అనిరుధ్‌కి మింగుడు పడకుండా ఉంది. అంతకంతకూ దూరం జరగసాగాడు. నన్ను పరాయిదానిలా చూస్తున్నాడు. "గొప్పదానివై పోయావ్" అని దెప్పి పొడుస్తున్నాడు!

నాలో నాకు తెలీకుండా మార్పు వచ్చిందా? లేక అతడి పరిస్థితి నిరాశాజనకంగా ఉంది గనుక అసూయ పడుతున్నాడా? అదీ ఇదీగాక ఎఫీసియంట్ వైఫ్ సిండ్రోమ్‌తో బాధపడుతూ తనని తాను న్యూనతగా భావించుకుంటున్నాడా?

మెల్లగా అతడి రాకపోకలు తగ్గిపోయాయి. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడు. తెలుగు విశ్వవిద్యాలయం వారు నా పుస్తకానికి పురస్కారం ప్రకటించారు. వార్త తెలిసి అభినందిస్తాడనుకున్నాను. తను చెయ్యలేదు, నా ఫోన్‌కి రెస్పాన్సివ్వనూ లేదు!

పిల్లాడి పెంపకంతో, కెరీర్ ఛాలెంజెస్‌తో కుస్తీ పడుతున్నాను. ఒంటరి పోరు చేస్తున్నాను. అమ్మ వచ్చి నాతో ఉంటున్నందువల్ల గాని లేకపోతే ఈ ఒత్తిడి, ఈ విషమస్థితి భరించలేకపోయేదాన్నేమో!

అతడు మోసం చేశాడన్న అభిప్రాయం, ఓడిపోయానన్న భావన, అప్రతిష్ఠ పాలయ్యానన్న ఫీలింగు నన్ను నిర్దాక్షిణ్యంగా నమిలేస్తూనే ఉన్నాయి!

"మగవాణ్ణి గుడ్డిగా నమ్మడంలోనే ఆడదాని జీవన విధ్వంసం దాగి ఉంది" నా గురించింతా తెలిసిన శాంత వ్యాఖ్యానించింది.

"పెళ్ళి చేసుకోండే అంటే విన్నావా, చూడు ఇప్పుడేం జరిగిందో. నా భయాలే నిజమయ్యాయి" అంటోంది అమ్మ.

"నాకేం హాయిగా ఉన్నాను" అని అన్లేకపోతున్నాను.

ఇదే అదనని భావించి క్లాసు పీకింది అమ్మ.

"మీ మధ్య ఎమోషనల్ ఎటాచ్‌మెంట్ లేదు. ఇద్దరూ రైలు ప్రయాణీకుల్లా కలిసున్నారు. ఇష్టమైనప్పుడు రైలు దిగిపోయే వెసులుబాటు మీ సహజీవనంలో ఉంది. చెప్పాపెట్టకుండా అతడు దిగిపోయాడు. ఇక దిగాల్సింది నువ్వే. ప్రతి ఒక్కరికీ తోడూ నీడా కావాలి. జీవితాంతం కావాలి. ఇప్పటికైనా మించి పోయింది లేదు. పెళ్లి చేసుకుని నీ బతుకుని చక్కదిద్దుకోవే" లాలనగా చెప్పింది.

"నీకు తెలుసుకదమ్మా నాకు పెళ్లి మీద సదభిప్రాయం లేదు. పసుపుతాడుని పలుపుతాడుగా భావిస్తాను" లోగొంతుకతో అన్నాను.

"పిచ్చిపిల్లా! లోపం పెళ్లిలో కాదు వ్యక్తుల్లో ఉంది. వారి స్వభావంలో, దృష్టిలో, దృక్పథంలో, దృక్కోణంలో ఉంది. ముఖ్యంగా పురుషుడిలో ఉంది. అతడి అహంకారంలో ఉంది. అభిజాత్యంలో ఉంది. ఒకరకంగా పెళ్లి అతడ్ని కట్టడి చేస్తుంది తెలుసా? అధిక అల్ప భావాలు, నీది నాది భేదాలు పోయి గంగా యమునల్లా కలిసిపోతే స్త్రీ పురుషుల సమానత్వం ఎందుకు సాధ్యం కాదు చెప్పు? ఆలుమగలు బండి చక్రాల్లాంటివారు. ఒకదానికొకటి సహకరిస్తేనే ప్రయాణం సజావుగా సాగుతుంది. అందుకు ముఖ్యంగా మగాడి బుద్ధీ, ధోరణీ మారాలి. స్త్రీ తను అబలకాదు సబల అని తెలుసుకోవాలి. ఇద్దరూ ఇగోలు పక్కన పెట్టాలి. అలా కానప్పుడు, మగాడు బంధాల్నుంచి బాధ్యతల్నుంచి తప్పించుకుంటున్నప్పుడు, ఆడసింహం వేటాడి తెస్తే తిని కూర్చుని ఫోజుకొట్టే మగసింహంలా ప్రవర్తిస్తున్నప్పుడు, సహజీవనమైనా సరే అపస్వరాలే పలుకుతుంది. కాదా చెప్పు?"

పునరాలోచనలో పడ్డాను. పునఃసమీక్షలో మునిగాను. రంగుల కళ్ళద్దాలు తీసేశాను. వేలవేల ఏళ్ళనుండి కాలాగ్నిలో కాలి నిగ్గు దేలిన వివాహవ్యవస్థ తాలూకు ధర్మాలు కళ్ళముందు ఆవిష్కృతమవసాగాయి!

''కళ్యాణమంటే పెళ్లి. శుభం. అభ్యుదయం. మానవాభ్యుదయం!'' ముక్తాయింపుగా అంది అమ్మ.

అతి స్వేచ్ఛ, అపరిమిత స్వాతంత్ర్యం, సుపీరియారిటీ కాంప్లెక్స్- నా శత్రువులుగా మారి నన్ను దెబ్బకొట్టాయని అర్థం కాసాగింది.

సింహావలోకనం సింహానికే కాదు జీవితపు ప్రతి ముఖ్య మలుపులోనూ మనుషులకీ అవసరమే అన్పిస్తోంది!

*     *     *

**(చినుకు - మార్చి -2017)**